క్లుప్తంగా

‘స్పందన’కు మూడు అర్జీలు

రేపల్లె రూరల్: స్పందన కార్యక్రమానికి మూడు అర్జీలు అందినట్లు ఆర్డీఓ జగన్నాథం పార్థ సారథి తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను ఆర్డీఓ స్వీకరించారు. కొల్లూరులో అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలు ఆపాలని రెండు అర్జీలు, రేపల్లె పట్టణంలో సర్వే డిపార్ట్‌మెంట్ నుంచి సర్టిఫికెట్ ఇప్పించాలని ఒక అర్జీ అందినట్లు చెప్పారు. సమస్యలను పరిశీలించి, పరిష్కరిస్తామని ఆర్డీఓ పేర్కొన్నారు.

వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్

రేపల్లె రూరల్: పట్టణంలో ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు మున్సిపల్ కమిషనర్ విజయ సారథి తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 21 నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన, 25 నుంచి 27వ తేదీ సెలక్షన్ కమిటీ ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు. పదో తరగతి విద్యార్హత, 18 నుంచి 35 మధ్య వయస్సు ఉన్న ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



నిజాంపట్నం: మొక్కలతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ప్రిన్సిపల్ కోటేశ్వరరావు తెలిపారు. నిజాంపట్నంలోని ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణల్లో మొక్కలు నాటే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కోటేశ్వరరావు మాట్లాడారు. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. పిచ్చి మొక్కలను తొలగించి, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి కొబ్బరి మొక్కలను నాటడం జరుగుతుందన్నారు.

బాలుడిని తీసుకెళ్లిన మతిస్థిమితంలేని మహిళ



తెనాలిరూరల్: మతిస్థిమితం లేని మహిళ తన బంధువుల ఇంటికి వెళ్లి నాలుగేళ్ల బాలుడిని తనతో తీసుకెళ్లిపోయింది. బాలుడు కనబడడంలేదని గుర్తించిన కుటుంబసభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించగా కేవలం గంట వ్యవధిలోనే పోలీసులు సదరు మహిళ, బాలుడి ఆచూకీ గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. తెనాలి మారిస్‌పేట సీఎం కాలనీ 6వ లైనుకు చెందిన గిరిజకు మతిస్థిమితం సరిగా ఉండదు. సోమవారం సాయంత్రం ఆమె తన ఇంటి సమీపంలో నివసించే బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడ కొద్దిసేపు గడిపిన ఆమె ఆ ఇంట్లోని నాలుగేళ్ల సిరిగిరి గౌతమ్‌విఘ్నేష్‌ను తన వెంట తీసుకుని వెళ్లింది. కొద్దిసేపటికి బాలుడు కనబడడంలేదని గుర్తించిన తల్లి, కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. గిరిజ కనబడకుండా పోయిందని తెలుసుకుని త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. సీఐ ఎస్.రమేష్ బాబు వెంటనే ఏఎస్ఐ హైదర్ అలీ, సిబ్బందిని అప్రమత్తం చేశారు. రంగంలోకి దిగిన సిబ్బంది బాలుడి ఇంటికి వెళ్లి ఆ ప్రాంతంలో జల్లెడపట్టారు. వెంటనే బాలుడు అదృశ్యమయ్యాడని మైక్ కాన్వాస్ ఏర్పాటు చేయించారు. అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. యడ్ల లింగయ్య పెట్రోల్ బంక్ వద్ద సీసీ ఫుటేజ్‌లో బాలుడు, గిరిజ వెళ్లినట్టు గుర్తించారు. ఆటో డ్రైవర్లు, అటుగా వెళుతున్న వారిని విచారించి గంట వ్యవధిలోనే గౌతమ్‌విఘ్నేష్‌తో పాటు గిరిజనూ తెనాలి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గుర్తించారు. వారిరువురిని స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేయడం పూర్తి కాకుండానే నిమిషాల వ్యవధిలో బాలుడి ఆచూకీ గుర్తించిన సిబ్బందిని సీఐ రమేష్‌బాబు అభినందించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కొల్లూరు : పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ టి.విజయలక్ష్మి అన్నారు. సోమవారం రావికంపాడు అంగన్‌వాడీ–2 కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో గర్భిణులకు, బాలింతలకు ఆమె పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఇంటిలోనే అతి తక్కువ ఖర్చుతో లభించే ఆకుకూరలను తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అఖిల, ఏఎన్‌ఎం నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.శ్రీలత, టి.శ్రీదేవి, ఆశ కార్యకర్తలు కె.మరియమ్మ, స్వప్న, సుబ్బమ్మ పాల్గొన్నారు.

రేపు కర్లపాలెంలో ‘జగనన్నకు చెబుదాం’

అధికారులతో ఆర్డీఓ రవీందర్ సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీందర్

కర్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకి చెబుదాం కార్యక్రమం మండలంలోని పెద్దింటమ్మ తల్లి ఆలయ కల్యాణ మండపంలో బుధవారం కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆర్డీఓ రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణపై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. మండల స్థాయిలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. ఉదయ 10 గంటలకు జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమం గురించి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు తెలిసే విధంగా దండోరా వేయించాలని ఆదేశించారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని చెప్పారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే విధంగా చూడాలని తహసీల్దారు కేశవ నారాయణరావును ఆర్డీవో ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఆర్డీవో రవీందర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎలీషాబాబు, వీఆర్వోలు కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.1.44లక్షల అక్రమ మద్యం సీజ్

బాపట్లటౌన్: ఇతర రాష్ట్రాల మద్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా తీసుకొచ్చి, సొమ్ము చేసుకుంటున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. రూ. 1.44 లక్షల విలువ కలిగిన కర్నాటక మద్యాన్ని తరలిస్తుండగా పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వెంకటేశులు సోమవారం వెల్లడించారు. చీరాల మండలం ఓడరేవుకు చెందిన కట్టా కోకిల, చిన్నపోతుల సాయి, చిన్నపోతుల మణికంఠ, స్టువర్టుపురం, 3వ గ్యాంగ్‌కు చెందిన వల్లభ ఝాన్సీ, ఒంగోలు టౌన్ 1వ వీధి మహేంద్ర నగర్‌కు చెందిన షేక్ బాషా, వేటపాలెం మండలం, దేశాయిపేటకు చెందిన నరస సందీప్ ఒక ముఠాగా ఏర్పడి కర్నాటక, గోవా రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాలకు తరలించి, విక్రయిస్తున్నారు. ఆదివారం సాయంత్రం బాపట్ల పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీ, పాత కబేళ సమీపం నుంచి ఏపీ31ఎడీ 3799, ఏపీ 27టీవై 4856 నంబర్లు గల కార్లలో 11 బ్యాగుల్లో 180 మి.లీ బాటిళ్లు 907, 60 ఫుల్ బాటిల్స్ చొప్పున మొత్తం రూ. 1.44,400 విలువ కలిగిన 1,023 బాటిళ్లను తరలిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో పట్టణ సీఐ యు. శ్రీనివాసులు తన సిబ్బందితో దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ యు. శ్రీనివాసులు, ఎస్ఐ షేక్ రఫీ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



బాపట్ల అర్బన్: మానవ సేవే.. మాధవ సేవగా వింగ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ పని చేస్తోందని సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ గుడివాడ బాబ్జీ అన్నారు. ఒంగోలు వింగ్స్ సేవా సంస్థ ప్రెసిడెంట్ చింతపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో బాపట్లలోని బేతని కాలనీలో ఉంటున్న 145 రోగుల కుటుంబాలకు నిత్యావసర సరుకులైన బియ్యం, చింతపండు, నూనె, పంచదార, గోధుమరవ్వను బాబ్జితో కలిసి సచివాలయ అడ్మిన్ డి.ప్రియాంక సోమవారం పంపిణీ చేశారు. ప్రతి నెలా కాలనీ వాసులకు ఉచితంగా నిత్యావసర సరుకుల పంపిణీ చేస్తున్నామని, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం ఇచ్చే పింఛనుతో హుందాగా జీవించాలని వారు కోరారు. తమ సంస్థ ద్వారా 405 కుటుంబాలకు ఆయా ప్రాంతాల్లో సాయం అందిస్తున్నామని గుడివాడ బాబ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జున రావు, కాలనీ పెద్దలు, వలంటీర్లు పాల్గొన్నారు.

బంద్ లేదు..



రేపల్లె బస్టాండు సెంటరులో బందోబస్తులో పోలీసులు

రేపల్లె రూరల్: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలో సోమవారం బందుకు పిలుపునిచ్చినా ఎక్కడా జరగలేదు. ఉదయం నుంచి వర్షం కురుస్తుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ మరికొంతమంది టీడీపీ, జనసేన కార్యకర్తలతో కలిసి వ్యాపార సముదాయాలను మూసివేయాలని ర్యాలీ నిర్వహించారు. పట్టణ సీఐ నజీర్ బేగ్, ఎస్ఐలు అబ్దుల్ రజాక్, నవీన్‌కుమార్ తమ సిబ్బందితో వారిని అడ్డుకుని, పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసు సిబ్బంది పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా.. శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి. పాఠశాలలు కూడా సాధారణంగానే నడిచాయి.

బందు స్పందన నిల్..

కొల్లూరు : టీడీపీ తలపెట్టిన బందుకు మండలంలో స్పందన కరవైంది. టీడీపీ, జనసేన నాయకులు కొల్లూరు బస్టాండు సెంటరు నుంచి ప్రదర్శన చేపట్టారు. దుకాణాలు, బ్యాంకులు, ప్రభుత్వ పాఠశాలలు మూసివేసేందుకు ప్రయత్నించారు. పోలీసు యాక్ట్ 30 అమలులో ఉన్న నేపథ్యంలో ప్రదర్శనలు, ధర్నాలు, బందులు నిర్వహించరాదని ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి వారికి వివరించారు. టీడీపీ శ్రేణులు బందుకు పిలుపునిచ్చినప్పటికీ.. దుకాణాలన్నీ తెరుచుకునే ఉన్నాయి. టీడీపీ, జనసేన ప్రదర్శన కొనసాగడంతో వేమూరు సీఐ వెంకటేశ్వరరావు ఆందోళన చేస్తున్న వారిని బైండోవర్ చేసి, పోలీసు స్టేషన్‌కు తరలించారు. వ్యక్తిగత పూచికత్తు మీద, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విడుదల చేశారు. కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ, జనసేన మండలాధ్యక్షుడు బొందలపాటి చలమయ్య ఉన్నారు.

అందరి సహకారంతోనే జాతీయస్థాయిలో గుర్తింపు



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

నెహ్రూనగర్: నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతోనే గుంటూరు నగరానికి జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరానికి జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్‌కు భోపాల్‌లో అవార్డ్ తీసుకున్న సందర్భంగా సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో కమిషనర్‌ను అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, వివిధ విభాగాధిపతులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరానికి జాతీయస్థాయిలో 3వ ర్యాంక్ వచ్చిందని, దక్షిణ భారతదేశంలో ఒక్క గుంటూరు నగరానికే అవార్డు రావడం ఎంతో గర్వకారణమన్నారు. అవార్డు రావడంలో నగర ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారం, అధికారులు, సిబ్బంది కృషి కీలకమన్నారు. వార్డు సచివాలయాల వారీగా మొక్కల పెంపకంపై కార్యదర్శులకు కార్యాచరణ ప్రణాళిక కేటాయించామన్నారు. పారిశుద్ధ్య విభాగంలో ఇంటింటి చెత్త సేకరణకు ఈ–ఆటోలను అందుబాటులోకి తెచ్చామని, డివైడర్లు, సెంట్రల్ మీడియన్స్‌లలో మొక్కల పెంపకం పెంచామన్నారు. కాలనీల్లో స్థానికంగా పార్క్‌లను ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా అభివృద్ధి చేశామన్నారు. త్వరలో నగరంలో స్థానికంగా ఉన్న నగరపాలక సంస్థ స్థలాల్లో మొక్కల పెంపకం, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధి చేస్తామన్నారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.అరుణ



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. అరుణ

ప్రత్తిపాడు: చిరుధాన్యాల్లో అత్యధిక పోషక విలువలు ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. అరుణ అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా సోమవారం గొట్టిపాడు సెక్టార్ పరిధిలోని పాత మల్లాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలవుతున్న ప్రీ–ప్రైమరీ విద్యపై అవగాహన కల్పించారు. పీపీ–1, పీపీ–2 పుస్తకాల గురించి చిన్నారుల తల్లులకు తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి.స్వాతి, వై.యమున పాల్గొన్నారు.

– ప్రత్తిపాడు సెక్టార్‌లోని ప్రత్తిపాడు వడ్డెరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు ప్రత్యేక అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త నగరాజకుమారి తల్లులకు చిరుధాన్యాల ఆవశ్యకతను తెలిపారు. పెరటి తోటల పెంపకం, ప్రీ–స్కూల్లో చెప్పే కథలు.. అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పోషకాహారం.. వంటి వాటి గురించి వివరించారు.

వడ్డీవారిపాలెంలో ఆరోగ్య సర్వే



రేపల్లె రూరల్: జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) మండలంలోని మోళ్లగుంట పీహెచ్‌సీ పరిధిలోని వడ్డీవారిపాలెంలో సోమవారం నిర్వహించారు. సర్వే బృంద సభ్యులు గ్రామంలోని ప్రతి కుటుంబంలోని వ్యక్తుల ఆరోగ్యం, ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు, సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య కార్యక్రమాలు రూపకల్పన చేసేందుకు ఈ సర్వే దోహదపడుతుందని బృంద సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మోళ్లగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణ్య, జిల్లా నోడల్ ఆఫీసర్ మల్లికార్జునరావు, సూపర్‌వైజర్లు రంగారావు, ప్రేమకుమారి, ఎన్ఎఫ్‌హెచ్ఎస్ సర్వే బృంద సభ్యులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఎంపికలు వాయిదా

మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి. డేవిడ్ రాజ్‌కుమార్

ప్రత్తిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో జరగాల్సిన మండల స్థాయి క్రీడా ఎంపికలు వర్షం కారణంగా వాయిదా పడినట్లు మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ పి. డేవిడ్ రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టి, మైదానం క్రీడలకు సిద్ధమైన తర్వాత ఎంపికలను తిరిగి నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు విషయాన్ని గమనించాలని కోరారు. అదేవిధంగా 14, 15 తేదీల్లో జరగాల్సిన నియోజకవర్గ స్థాయి ఎంపికలు కూడా వాయిదా పడినట్లు పేర్కొన్నారు. మండల స్థాయి ఎంపికలు ముగిసిన వెంటనే నియోజకవర్గ స్థాయి ఎంపికలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మరోసారి ఎంపికలు జరిగే తేదీలను ప్రకటిస్తామని డేవిడ్ రాజ్‌కుమార్ చెప్పారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

– ఎస్ఐ డి. రవీంద్రబాబు



ప్రత్తిపాడు: ప్రమాదాల నివారణకు పోలీసులు ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి నివారణ చర్యలు చేపట్టారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు ప్రత్తిపాడులోని గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై, పంచాయతీ కార్యాలయం ఎదురు ఆర్ అండ్ బీ రోడ్డుపై గుంతలు పడ్డాయి. దానికి తోడు టిప్పర్లు, భారీ వాహనాలు ఈ మార్గంలో అధికంగా తిరుగుతుండటంతో గుంతలు పెద్దవయ్యాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు రాత్రి సమయాల్లో గుంతల వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో ప్రత్తిపాడు ఎస్ఐ డి. రవీంద్రబాబు గుంతలు పూడ్చించే సామాజిక బాధ్యతను తీసుకున్నారు. ఆర్ అండ్ బీ ఏఈతో మాట్లాడి సోమవారం రాత్రి మెయిన్ రోడ్డుపై పడిన గుంతలను దగ్గరుండి పూడ్చించారు. ప్రమాదాల నివారణకు తన వంతుగా చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

రైతుల అభివృద్ధి దిశగా పరిశోధనలు చేపట్టాలి

– లాంఫాం శాస్త్రవేత్తలతో ఎన్జీరంగా వర్సిటీ వీసీ సమావేశం



గుంటూరు రూరల్: రైతుల అభివృద్ధికి నూతన పరిశోధనలు చేపట్టాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి తెలిపారు. సోమవారం నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన కేంద్రానిన ఆమె సందర్శించారు. శాస్త్రవేత్తలు, బోధన, బోధనేతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమన్వయంతో కృషి చేసి, విశ్వవిద్యాలయాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా పరిశోధనలు జరపాలని సూచించారు. తనపై నమ్మకంతో వీసీగా నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బయో టెక్నాలజీ ల్యాబ్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న పరిశోధనలను శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి

తెనాలిరూరల్: తెనాలిలో మల్లి వీడియోస్‌గా ప్రాచుర్యం పొందిన ఫొటో కం వీడియోగ్రాఫర్ పుట్టగుంట మల్లికార్జునరావు అలియాస్ మల్లి(54) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నందులపేటకు చెందిన మల్లి తెనాలి నుండి తన కుమారుడు దీపక్ సాయితో పాటు మరో ఇద్దరు ఫొటో వీడియో గ్రాఫర్లతో కలిసి ఓ శుభకార్యం నిమిత్తం హైదరాబాద్‌కు తమ సొంత కారులో వెళ్లారు. ఆదివారం సాయంత్రం ఫంక్షన్ ముగించుకుని తిరిగి క తెనాలి వస్తుండగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై సోమవారం తెల్లవారుజామున ప్రమాదానికి గురయ్యారు. వీరి కారును డీసీఎం లారీ ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా స్థానికులు వారిని హుటాహుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వీడియో గ్రాఫర్ మల్లి మృతి చెందారు. వీరితో పాటు ఉన్న ఆయన కుమారుడు దీపక్ సాయి, నరసరావుపేటకు చెందిన అబ్దుల్లా కొద్దిపాటి గాయాలతో ప్రాణాపాయం నుండి బయటపడ్డారు. తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన మల్లెల వెంకట్‌కు తీవ్ర గాయాలు కాగా అతడికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు.

సమయపాలన లేని అంగన్‌వాడీ కార్యకర్తపై చర్యలు

మొగదారమ్మ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రం తనిఖీకి వచ్చిన ఎంపీడీవో నాగలక్ష్మి

నిజాంపట్నం: సమయపాలన లేని అంగన్‌వాడీ కార్యకర్త ఉషపై సంబంధిత శాఖ అధికారుల ద్వారా చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎంపీడీవో నాగలక్ష్మి అన్నారు. నిజాంపట్నంలోని మొగదారమ్మ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. కేంద్రంలో సేవలు పొందుతున్న చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా చేయటం లేదనే.. తల్లిదండ్రుల నుంచి వస్తున్న ఆరోపణలపై విచారణ చేసినట్లు తెలిపారు. తాము వచ్చే సమయానికే అంగన్‌వాడీ కేంద్రం మూసి ఉందని చెప్పారు. కేంద్రానికి వచ్చే చిన్నారుల తల్లిదండ్రులను పిలిపించి, విచారించగా కార్యకర్త ఉషారాణి కేంద్రానికి నిత్యం హాజరుకాదని, ప్రభుత్వం నుంచి వచ్చే గుడ్లు తదితర పౌష్టికాహార వస్తువులు పక్కదారి పట్టిస్తోందని చెప్పినట్లు వెల్లడించారు. చిన్నారులను కూడా సరిగా పట్టించుకోదని.. తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులకు నివేదిక ఇచ్చి, చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో పంచాయతీ సెక్రటరీలు ప్రసాద్, రమేష్ తదితరులున్నారు.

అనుమతులు లేవు.. నిర్మాణాలున్నాయి



రెడ్డిపాలెంలో అనుమతి లేకుండా నిర్మించిన దుకాణాలు

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెం పెట్రోలు బంకు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా అనధికారికంగా కొన్ని దుకాణాలను నిర్మించారు. జాతీయ రహదారికి పక్కనే ఇంత జరుగుతున్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. అనుమతులు తీసుకోవడం వల్ల పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. అయితే ఎలాంటి అనుమతులు లేనప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడానికి ప్రధాన కారణం ముడుపులు ముట్టడమేనని పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

ఈ విషయంపై గ్రామ కార్యదర్శి శేషగిరిరావును వివరణ కోరగా గ్రామ పంచాయతీ అనుమతి కోసం దరకాస్తు చేశారని, అయితే డాక్యుమెంట్లు సక్రమంగా లేకపోవడంతో ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

న్యాయస్థానంపై ప్రజలకు నమ్మకం పెరిగింది

వేమూరు: అవినీతికి పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబును అరెస్టు చేయడంతో సామాన్యునికి న్యాయ స్థానంపై నమ్మకం పెరిగిందని, ప్రముఖ న్యాయవాది చందోలు డేవిడ్ విజయ కుమార్ అన్నారు. జంపని గ్రామంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు చెప్పుకుంటున్నట్లుగా ఆయన నిప్పు అయితే.. కోర్టులో తన శీలత ఎందుకు నిరూపించుకోలేకపోయారన్నారు. ఆయన అరెస్టుతో రాష్ట్రంలో ఎటువంటి అలజడి జరగకుండా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుందన్నారు. ఇప్పటికే పలు కేసుల్లో స్టేలు తెచ్చుకున్న చంద్రబాబు కోర్టులో తన నిజాయతీని నిరూపించుకునేందుకు ఎందుకు జంకుతున్నారని ప్రశ్నించారు. జయలలిత, కరుణానిధి, లాలు ప్రసాద్ యాదవ్, చిదంబరం, అమిత్ షా వంటి వారు జైలుకు వెళ్లి తమ నిజాయతీని నిరూపించుకునే యత్నం చేశారని గుర్తుచేశారు. వారి కంటే చంద్రబాబు ఏమీ అతీతుడు కాదని, టీడీపీ నేతలు అనవసరంగా ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో బందులు, రాస్తారోకోలు, ఉద్రిక్తలు సృష్టించాలనే యత్నాలు మానుకోవాలని హితవు పలికారు. ప్రజా ధనం దుర్వినియోగంపై చంద్రబాబును ప్రశ్నించాల్సిన పవన్ కల్యాణ్ అందుకు.. భిన్నంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం దారుణంగా ఉందన్నారు.

చందోలులో ‘చెత్త’ సమస్య..



చందోలు గ్రామ సచివాలయం ముందు చెత్తకుప్ప



పిట్టలవానిపాలెంలో నిలిచిన మురుగు నీరు

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. నాలుగు రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు రాకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే నిలిచి, దుర్వాసన వెదజల్లుతోంది. పిట్టలవానిపాలెం గ్రామంలో పలు వీధుల్లో వర్షపు నీరు, మురుగు నిలిచి దోమలు కేంద్రాలుగా మారాయి. మురుగునీటి పారుదల సౌకర్యం లేకపోవడంతో ఇళ్లలోని నీరు, వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉంటున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి, కాలువల్లో పూడిక తీయించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఈఓపీఆర్డీ కొల్లిపర పద్మజను వివరణ కోరగా.. చందోలులో రెండు రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు పనికి రావడం లేదని, తక్షణమే చెత్త సేకరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించినట్లు తెలిపారు.

ఐకమత్యంతోనే సమస్యలకు పరిష్కారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులతో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అనంత మల్లికార్జున

గుంటూరు ఎడ్యుకేషన్: కళాత్మక నైపుణ్యంతో కూడిన చేనేత సంఘీయులుగా పేరు గడించిన తొగట వీర క్షత్రియులు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను ఆయుధంగా చేసుకుని, ఐకమత్యంతో సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని శ్రీ చౌడేశ్వరి తొగట వీర క్షత్రియ సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మోదెం వీరాంజనేయప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ చౌడేశ్వరి తోట వీర క్షత్రియ సేవా సంఘం 2023–25 సంవత్సరాలకు సంబంధించి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బ్రాడీపేటలోని పెన్షనర్స్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు అనంత మల్లిఖార్జున మాట్లాడుతూ తొగట వీర క్షత్రియుల సామాజిక ఆర్థిక విద్యాపరమైన అభివృద్ధి కోసం జిల్లా నాయకత్వం పనిచేస్తోందని చెప్పారు. పేద విద్యార్థులకు కావలసిన విద్యాభివృద్ధికి అన్ని రకాల సహాయ, సహకారాలు అందజేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు పారితోషకాలు అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి, నూతన గౌరవాధ్యక్షుడు డాక్టర్ కుండా వెంకటేశ్వర్లు, వెనిగళ్ల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు నీలం చలమయ్య, పోస చౌడేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి వీర్నాల వెంకటేశ్వర్లు, కోశాధికారి కాల శ్రీనివాసరావు, ఉద్యోగ విభాగం గండిగ అంతోని, మహిళా నాయకులు ఎం.ఉషా రాణి, పసల దివ్య పాల్గొన్నారు.